


స్వర్ణ రథంపై వరసిద్ధుడి విహారం



స్వర్ణ రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే ఈవో తదితరులు



సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలకు హారతి



ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతం

కాణిపాక ఆలయంలో బుధవారం సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఆస్థాన మండపంలోని వేదికపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు.రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథంపై స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఎమ్మెల్యే మురళీమోహన్,ఆలయ ఈవో పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి



అవార్డును అందుకుంటున్న ఎస్పీ మణికంఠ తదితరులు

చిత్తూరు పోలీసులకు ఏబీసీడీ అవార్డు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి: నేర పరిశోధనలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి పోలీసుశాఖ ఇచ్చే ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డును చిత్తూరు జిల్లా పోలీసులు సాధించారు. ఈ ఏడాది జూలై 7న ఏటీఎంను పగుల గొట్టి నగదును ఎత్తుకెళ్లిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సకాలంలో సాంకేతికతను వినియోగించి అరెస్టు చేశారు. ఇందుకుగాను చిత్తూరు సబ్ డివిజనల్, వెస్ట్ సర్కిల్ పోలీసుల కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం మొదటి బహుమతి కింద రూ. లక్షను ప్రదానం చేశారు.విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావుల చేతులమీదుగా అడిషనల్ డీజీపీ రవిశంకర్, లా అండ్ ఆర్డర్ ఐజీ శ్రీకాంత్ సమక్షంలో ఎస్పీ మణికంఠ చందోలు, గత వెస్ట్ సర్కిల్ సీఐ రవిశంకర్‌రెడ్డి, టెక్నికల్ టీం సభ్యులు దేవరాజులు, గోపి, నవీన్‌లకు ఈ అవార్డును స్వీకరించారు.మూడునెలలకోసారి ఏబీసీడీ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది.

గురుకుల చదువులపై ‘సమ్మె’ట



ఆన్‌లైన్‌లో విద్యాబోధన చేస్తున్న ప్రిన్సిపాల్

- ప్రిన్సిపాళ్లతో నడుస్తున్న విద్యాలయాలు
- సిలబస్‌లో విద్యార్థుల వెనుకబాటు

పుంగనూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గురుకులాల్లో (రెసిడెన్షియల్ స్కూల్స్) కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు నెలరోజులుగా చేస్తున్న సమ్మె విద్యార్థుల చదువులను ప్రభావితం చేస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం గిరిజన వసతి గృహాలను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమించలేదు. మౌలిక వసతులపైనా దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు తమ డిమాండ్లతో గతనెల 16 నుంచి సమ్మెకు దిగారు.గిరిజన గురుకులాల్లో చిత్తూరులో 195మంది బాలికలు , పుంగనూరులో 128మంది బాలికలు,బంగారుపాళ్యంలో 115మంది బాలురు, రామకుప్పంలో 115మంది బాలురు ఉన్నారు.గతంలో ఒక్కో గురుకులానికి ప్రిన్సిపాల్, ఎనిమిదిమంది ఉపాధ్యాయులు, జూనియర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, అటెండర్ పోస్టులను మంజూరు చేశారు.కానీ అత్యధిక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పుంగనూరు గురుకులంలో ఎనిమిదిమంది ఉపాధ్యాయులకు గానూ ముగ్గురున్నారు. వారిలో ఒకరు లీవుపై వెళ్లగా మరో ఇద్దరు సమ్మెలో ఉన్నారు. ప్రిన్సిపాళ్ల చొరవతో 10వ తరగతి విద్యార్థులకు మాత్రం ఆన్‌లైన్‌లో విద్యాబోధన జరుగుతోంది. ఆన్‌లైన్ క్లాసులు పెట్టడానికి కూడా సిబ్బంది లేరు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసేవారూ లేరు. బాలికల గురుకులాల్లో రాత్రి



కాపలాదారులు లేరు.భోజనశాల, నిద్రపోవడానికి వసతి కల్పించలేదు. పగలు తరగతి గదులనే రాత్రి నిద్రకు విద్యార్థులు ఉపయోగించుకుంటున్నారు. మిగిలిన ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాబోధన సక్రమంగా జరుగుతోంది. పదవ తరగతి పరీక్షలకు ప్రభుత్వం తేదీలు ప్రకటించిన క్రమంలో ఇక్కడి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. బాలికల గురుకులంలో ఎనిమిది పోస్టులకు తెలుగు, మ్యాథ్స్ సబ్జెక్టులకు కాంట్రాక్ట్ టీచర్లుండగా మరో టీచర్ సెలవుపై వెళ్లారు. మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చాలీచాలని ఉపాధ్యాయులతో క్లాసులను నిర్వహించడం కష్టంగా మారింది. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి మాట్లాడుతూ ప్రిన్సిపాల్ ద్వారా ఐఎఫ్పీ ప్యాడ్స్ ద్వారా కొంతమేర విద్యాబోధన జరుగుతోందన్నారు. ప్రతి గురుకులానికీ ఇద్దరు ఉపాధ్యాయులు ప్రకాశం జిల్లా నుంచి డిప్యుటేషన్‌పై వస్తున్నారన్నారు. తాత్కాలికంగా ఒక్కో ఉపాధ్యాయుడిని కేటాయించడానికి జిల్లా విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు అంగీకరించారన్నారు. త్వరలోనే డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులు వస్తారన్నారు.

భూముల ధరలు పెంపు

- గరిష్ఠంగా 20శాతం పెంచే అవకాశం
- జనవరి 1నుంచి అమల్లోకి కొత్త మార్కెట్ విలువలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూముల ధరలు పెంచేందుకు రంగం సిద్ధమైంది.అధ్యయనం చేసి, సవరించిన ధరలు సిద్ధం చేయాలని స్టాంపులు - రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెంచాల్సిన భూముల ధరలను గురువారం ఖరారు చేయనున్నారు. ఏ ప్రాంతంలో ఎంత మేర పెంచాలనే దానిపై క్షేత్రపరిశీలనతో పాటు జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు అనధికారికంగా సమీక్ష కూడా పూర్తిచేశారు. ప్రభుత్వానికి తగినంత ఆదాయం సమకూర్చడంతో పాటు ప్రజలపై పెద్దగా భారం పడకుండా ఈ సారి విలువల పెంపు సుమారు రూ.30 - 40 కోట్ల మేర ఉండనున్నట్లు సమాచారం.

● గత నాలుగేళ్ళలో...

గత నాలుగేళ్ళలో జగన్ సర్కార్ భూ మార్కెట్ విలువలను నాలుగు సార్లు పెంచింది. మొదట 2020 ఆగస్టులో 10 నుంచి 30 శాతం వరకు ధరలను సర్కారు పెంచింది. 2021లో కరోనా కారణంగా భూముల విలువ పెంపు జోలికి పోలేదు. 2022 ఫిబ్రవరి 1 నుంచి కొత్త మార్కెట్ ధరలను ప్రభుత్వం అమలు చేసింది. 2022 ఏప్రిల్‌లో భూవిలువలను 20 నుంచి 40శాతం వరకు పెంచింది. 2024 జూన్ ఒకటి నుంచి భూముల ధరలను పెంచుతున్నట్లు ఆదేశాలు ఇచ్చింది.నిబంధనలను పాటించకుండా వైసీపీ ప్రభుత్వం భూవిలువలను ఇష్టారాజ్యంగా పెంచేయడంతో క్రయ, విక్రయదారులపై పెనుభారం పడింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం 2025జనవరి 1 నుంచి పెంపును గరిష్ఠంగా 20శాతానికి పరిమితం చేసినట్లు సమాచారం. ఈ మేరకు రూ.30 - 40 కోట్ల మేర జిల్లాలో భూవిలువలు పెరిగే అవకాశం ఉంది. సాధారణంగా ఏటా ఆగస్టు 1 నుంచి పట్టణ ప్రాంతాల్లో, రెండేళ్ళకోసారి గ్రామీణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలు పెంచుతారు. ఈ ఏడాది ఆరంభంలో ఎన్నికల హడావుడి, కొత్తప్రభుత్వం ఏర్పడ్డాక వర్షాలు, ఇతర ఆటంకాల వల్ల ఇప్పటివరకు ఈ ప్రక్రియ పట్టాలెక్కలేదు. చాలా ప్రాంతాల్లో



మార్కెట్ విలువల పెంపుపై జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లతో చర్చిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ గిరిబాబు


భూముల ఓపెన్ మార్కెట్ ధరలకు, ప్రభుత్వం నిర్ణయించే మార్కెట్ ధరలకు చాలా వ్యత్యాసం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఈ వ్యత్యాసానికి అనుగుణంగా ప్రభుత్వ మార్కెట్ ధరలను సవరించాలని అంటే ధరలు పెంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

● నేడు జేసీ అధ్యక్షతన సమావేశం

భూవిలువల పెంపుపై గురువారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో జిల్లా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ సమావేశం జేసీ విద్యాధరి అధ్యక్షతన జరగనుంది. తొలుత ఉదయం 11 గంటలకు జరగాల్సివుండిన ఈ సమావేశాన్ని కొన్ని అనివార్య కారణాలతో సాయంత్రం 5 గంటలకు మార్చారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ గిరిబాబు, జిల్లా రిజిస్ట్రార్ మునిశంకరయ్య, ఎనిమిదిమంది సబ్‌రిజిస్ట్రార్లు పెంపు ప్రతిపాదనలతో సమావేశానికి హాజరుకానున్నారు. సమావేశంలో ఏయే ప్రాంతాల్లో పెంపు, తగ్గింపు అంశాలపై జేసీ అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రతిపాదనలను ఆమోదించి ప్రభుత్వ పరిశీలనకు పంపిస్తారు. ఆ తర్వాత వాటిని రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో ఉంచి ప్రజలనుంచి అభ్యంతరాల స్వీకరిస్తారు. ఖరారైన ప్రతిపాదనలను మరోసారి ప్రభుత్వానికి పంపి జనవరి ఒకటి నుంచి అమల్లోకి తేనున్నారు.

కార్యకర్తల నుంచే నేతలు రావాలి

- ప్రజా వ్యతిరేక పనులు చేస్తే భూస్థాపితం
- వచ్చే నెలలో వస్తా ...అభివృద్ధి పనులు ప్రారంభిస్తా
- కుప్పం టీడీపీ శ్రేణులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



కుప్పం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ‘కార్యకర్తలను గుర్తించండి. వారే పార్టీకి బలం. ప్రజల్లో ఉండండి. నిరంతరం పనిచేయండి. ప్రజా వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడినట్లు తెలిస్తే వారు భూస్థాపితం అవుతారు, జాగ్రత్త.’ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు బుధవారం కుప్పం టీడీపీ శ్రేణులకు చేసిన హితవుతో కూడిన హెచ్చరిక ఇది. సాయంత్రం సుమారు గంట సమయం టీడీపీ శ్రేణులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ సారాంశం ఇదీ.. ‘పార్టీలో ఎవరూ శాశ్వతం కాదు. కార్యకర్తలు లేకపోతే పార్టీ లేదు.వారినుంచే నాయకులు పుడతారు. ప్రతిపక్షంలో ఉన్నన్నాళ్లూ భుజాన జెండా మోసిన కార్యకర్తలను గుర్తించి గౌరవించండి. ఆర్థికంగా దన్నుగా నిలవండి. మన కుప్పంలో ప్రజలు కూడా ఊహించనంతటి అభివృద్ధిని చేసి చూపిస్తాను.ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.బయటినుంచి వచ్చిన వ్యక్తులు కాంట్రాక్టులు చేస్తే ఊరుకోను. న్యాయమైన పద్ధతిలో సంపాదించే మార్గాన్ని మనం కార్యకర్తలకు చూపించాలి. వైసీపీ నాయకులకు సపోర్ట్ చేసేవారికి పుట్టగతులుండవు. ప్రజలతో మమేకం కావాలని ఎన్నిసార్లు చెప్పినా మీరు మారడంలేదు. ఈ ఆరునెలల కాలంలో ప్రజలను పూర్తిగా మరిచిపోయారు. ఇది మంచి పద్ధతి కాదు. సుమారు రెండేళ్లలో మున్సిపల్, స్థానిక ఎన్నికలు వస్తున్నాయి. నిరంతరం ప్రజల్లో ఉండి, వారికోసం పనిచేస్తూ ఉంటేనే ఏ ఎన్నికల్లోనైనా విజయం లభిస్తుంది. ఈ విషయం ప్రతిఒక్కరూ గుర్తుంచుకోండి.నేను ప్రభుత్వ పరంగా ఏమి చేయగలనో అన్నీ చేసి చూపిస్తున్నా.జనవరి నెలలో కుప్పం నియోజకవర్గంలో మూడు రోజులు పర్యటిస్తా.పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించబోతున్నా. మీరు ప్రజల్లో ఉండకుండా సొంత వ్యవహారాలకు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పరిమితమైతే ఊరుకునేది లేదు.మీమధ్య ఉన్న గ్యాప్‌ను సరిచేసుకోండి. పక్కదార్లను నేను ప్రోత్సహించను. ఎవరైనా అలా పక్కదార్లు తొక్కితే సహించను. అక్కడేం జరుగుతున్నదో అన్ని విషయాలూ నాకు తెలుసు.ఒక ఎమ్మెల్యే సతీమణిగా, ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీగా మేడమ్ (నారా భువనేశ్వరి) అక్కడకు వస్తున్నారు. ఎవరూ అతి చేయొద్దు.ఆమె ట్రస్టు కార్యక్రమాలు సజావుగా జరిగేలా సహకరించండి.’ అని చంద్రబాబు టీడీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

కుప్పం చేరుకున్న భువనేశ్వరి

కుప్పం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి నాలుగు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం చేరుకున్నారు.హైదరాబాద్‌నుంచి ఆమె బుధవారం సాయంత్రం విమానం ద్వారా బెంగళూరు చేరుకున్నారు. అక్కడినుంచి రోడ్డు మార్గంలో రాత్రి 8.30 గంటల ప్రాంతంలో కుప్పం చేరుకుని, పీఈఎస్ వైద్య కళాశాల అతిథి గృహంలో బస చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు,టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తోపాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భువనేశ్వరికి ఘన స్వాగతం పలికారు. అంతకుముందు విమానాశ్రయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు తదిరులు స్వాగతం పలికారు. నారా భువనేశ్వరి గురువారంతో ప్రారంభించి, ఈనెల 22వ తేదీదాకా కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించనున్నారు.గురువారం పర్యటన వివరాలు ఇవీ..



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న కుప్పం నేతలు

9ఏఎం - 10ఏఎం - ప్రజలనుంచి వినతుల స్వీకరణ
10.15 ఏఎం - 10.45 ఏఎం - శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మిస్తున్న సొంత ఇంటి పనుల పరిశీలన
11.00ఏఎం - 12.15 పీఎం - కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి
12.30 పీఎం - 2 పీఎం - గుడుపల్లె మండలం నలగాంపల్లె గ్రామస్థులతో ముఖాముఖి
3పీఎం - 3.45 పీఎం - స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ విస్తరణకు ప్రారంభోత్సవం
3.45పీఎం - 4.45 పీఎం - తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ
4.45 పీఎం-5.45 పీఎం - డీఎస్సీ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో ముఖాముఖి
6పీఎం- 7పీఎం- పీఈఎస్ గెస్ట్‌హౌస్‌లో టీడీపీ శ్రేణులతో సమావేశం

డీసీసీబీ విచారణాధికారికి నలుగురు సహాయకులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో గత పాలకవర్గం చేసిన ఆర్థిక విధ్వంసంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారణకు ఆదేశించారు. జిల్లా రెవిన్యూ అధికారి కె. మోహన్‌కుమార్‌ను ఈనెల ప్రారంభంలో విచారణ అధికారిగా నియమించారు. 120 రోజుల్లోగా విచారణ జరిపి ఆయన నివేదిక ఇవ్వనున్నారు. డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం. రెడ్డెమ్మ అధ్యక్షతన ఏర్పడిన పాలకవర్గం హయాంలో చోటుచేసుకున్న అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో జూలై 11, 12, నవంబరు 13న కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో పాటు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు గత పాలకవర్గం తప్పిదాలపై సీఎం చంద్రబాబుకు అక్టోబరులో ఫిర్యాదు చేశారు. దాంతో అక్టోబరు 10న ప్రభుత్వం విచారణకు డీసీవో నాగవర్ధనను ఆదేశించింది. ఆమె ప్రాథమిక విచారణ జరిపి బ్యాంకు పరిధిలో అక్రమాలు, అవకతవకలు జరిగింది వాస్తవమే అంటూ ప్రభుత్వానికి నివేదిక పంపారు. దాంతో ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్‌ను ఆదేశించింది. దాంతో సహకారశాఖ అధికారులను నమ్మని కలెక్టర్ రెవిన్యూ శాఖకు చెందిన డీఆర్వో మోహన్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విచారణలో భాగంగా ఆయనకు సహాయకులుగా ఐదుగురిని నియమించాల్సి ఉండగా, జిల్లా సహకార ఆడిట్ అధికారి కె. బ్రహ్మానంద రెడ్డి, కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరీఫుల్లా, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, కంప్యూటర్ ఆపరేటర్ ఇమ్మానువేల్‌లను నియమిస్తూ డీసీవో బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

మామిడి పంట బీమా గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మామిడి పంట బీమా నమోదు గడువు డిసెంబరు 31 వరకు పొడిగించినట్లు ఉద్యాన శాఖాధికారి మధుసూదనరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువు సమయం ఈ నెల 15కు ముగియగా, రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించిన తెలిపారు. వాతావరణ ఆధారిత బీమా పథకం కింద ఎకరాకు రూ.35 వేలు బీమా వర్తించేందుకు రైతు వాటా కింద రూ.1750 ప్రీమియం చెల్లించాలన్నారు. డిసెంబరు ఒకటి నుంచి 2025 మే 31వ నాటి వరకు వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా జరిగే మామిడి పంట నష్టానికి బీమా వర్తిస్తుందని తెలిపారు. రైతులు ఆర్బీకేల్లో ఇన్‌చార్జిలను కలిసి రబీ సీజన్‌కు అవసరమైన ఈ పంట నమోదు తప్పని సరిగా చేసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయికి వెళ్ళకుంటే ఎలా?

- ఎంపీడీవోలపై కలెక్టర్ అసహనం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కలుషిత నీటిని తాగడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులకు ఎవరు బాధ్యత వహిస్తారు? పంచాయతీ కార్యదర్శులు శుభ్రం చేస్తున్నారన్న విషయాన్ని ఎవరు రుజువు చేస్తారు? ఇందుకు సంబంధించి మండలంలో రికార్డులు నిర్వహిస్తున్నారా? అసలు ఎంపీడీవోలు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారా?... చాలాచోట్ల ప్రజలు మాత్రం లేదనే చెబుతున్నారంటూ కలెక్టర్ సుమిత్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పారిశుధ్యం, హౌసింగ్,ఉపాధి హామీ, తాగునీరు సంబంధిత అంశాలపై ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలతో చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి నియోజకవర్గాలవారీగా సంబంధిత శాఖల అధికారులతో, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించేందుకు ఎంపీడీవోలు చొరవ చూపాలన్నారు. రూ.5లక్షల్లోపు పనులను వెంటనే ప్రారంభించాలని, అంతకుమించిన పనులను మార్చి 31లోగా పూర్తిచేయాలని చెప్పారు. తాగునీటి ట్యాంకులను నెలకోసారి కచ్చితంగా శుభ్రంచేయాలని, వాటికి రికార్డులు నిర్వహించాలని, ప్రతినెలా ఎంపీడీవోలు వాటిని ధ్రువీకరించాలన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి పలు మండలాల్లో తప్పులు జరిగినట్లు విజిలెన్స్ బృందాల తనిఖీల్లో తేలిందన్నారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను పారదర్శకంగా సకాలంలో గ్రామాభివృద్ధి పనులకు వినియోగించాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, హౌసింగ్ పీడీ పద్మనాభం, డ్వామా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ అద్భుత క్షేత్రం తిరుమల



● విద్యాశంకర భారతీస్వామి

ఈ బ్రహ్మాండంలో అద్భుతమైన క్షేత్రం తిరుమల అని పుష్పగిరి శంకరాచార్య మఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి అన్నారు. బుధవారం నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'రామరాజ్యం వచ్చి ప్రజలందరూ ఆనందంగా ఉండాలి. లోకాన్ని రక్షించాలి. జనాల్లో సద్బుద్ధి, ధార్మిక చింతన కలగాలి' అని స్వామిని కోరుకున్నానని చెప్పారు. స్వామి మహత్యం కనిపిస్తే తద్వారా హైందవ లోకంలో సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. ఆలయం వద్ద భారతీస్వామికి అర్చకబృందం, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

■ పెద్దజీయర్‌స్వామికి పెద్ద మర్యాద



అమ్మవారి ఆలయం వద్ద పెద్దజీయార్‌స్వామి

పెరియ కోయిల్ కెల్వియప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్‌స్వామికి బుధవారం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం.. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో పెద్దమర్యాద జరిగింది. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం ఆయన అమ్మవారు, గోవిందరాజస్వామి మూలవర్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేసి సత్కరించారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భగవద్ రామానుజాచార్యుల కాలంలో తిరుమలలో పెద్దజీయర్ మఠం ఏర్పాటైంది. శ్రీవారి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలను ఇప్పటికీ పెద్దజీయర్ పర్యవేక్షిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు.. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీఏఓ బాలాజీ, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, శాంతి, నాగరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుచానూరు/తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.59 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,598

తలనీలాలు సమర్పించిన వారు: 20,102

పాటించాలి జాగ్రత్తలు



తుపాను వాతావరణంతో చలిగాలులు విపరీతంగా పెరిగిపోయాయి. సూర్యుడి జాడ పెద్దగా కనిపించడదం లేదు. కనిపించినా ఎండ పడడం లేదు.ఈ వాతావరణం కొత్త అనారోగ్యాలకు దారి తీస్తోంది. జలుబు, దగ్గు, జ్వరాలతో జనం ఆసుపత్రులకు బారులు తీరుతున్నారు. ఇప్పటికే కురిసిన వానలకు కుంటలన్నీ నిండిపోయి దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. వృద్ధులు, పిల్లలు శ్వాసకోస సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇటువంటి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

పిల్లలు జాగ్రత్త





చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన జలుబు, దగ్గు, జ్వరాలు బారిన శీతాకాలంలో ఎక్కువగా పడుతారు. జలుబు తీవ్రత వల్ల ఊపిరి పీల్చుకునేందుకు కూడా ఇబ్బంది పడతారు. నిద్ర పట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులను వీలైనంత వరకు బయట చల్లగాలులకు తీసుకు వెళ్లకూడదు. ఉన్ని, ఒదులుగా ఉండే దుస్తులను పిల్లలకు వేయడంతోపాటు చెవుల్లో గాలిపోకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఆహారం, నీళ్లు, వెచ్చగా ఉండాలి. కూల్‌డ్రింక్స్‌కి, స్వీట్లుకి దూరం పెట్టాలి. నెలల బిడ్డల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మేలు.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయా

బాలింతలూ.. ఇవి పాటించండి!





చలికాలంలో బాలింతలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచు, చలిగాలులలోకి రాకూడదు. బయటకు రావలసివస్తే చెవుల్లోకి గాలిపోకుండా చూసుకోవాలి. వానకు తడిస్తే వెంటనే బట్టలు మార్చుకోవాలి. పోషక విలువలున్న ఆహారమే తీసుకోవాలి. అదీ వేడిగా ఉండేలా చూసుకోవాలి. కాన్పు తర్వాత కనీసం అయిదు నెలలపాటు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. వారు ఆరోగ్యంగా ఉంటేనే, వారి చిన్నారులూ ఆరోగ్యంగా ఉంటారు.

-డాక్టర్ పార్థసారథిరెడ్డి, తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్

వృద్ధుల కోసం రుయాలో ప్రత్యేక ఓపీ కౌంటర్లు



చలికాలం, వానా కాలం .. వృద్ధులే అనేక ఆరోగ్య సమస్యల బారిన పడతారు. రుయాలో వృద్ధుల కోసం ప్రత్యేక ఓపీ కేంద్రాలను అందుబాటులో ఉంచాం. ఓపీకి వస్తున్న వారిలో 50 ఏళ్లు పైబడిన వారే ఎక్కువ. జలుబు, దగ్గు, జ్వరాలు వంటి జబ్బులతో, శ్వాసకోస సమస్యలతోనే వీరు వస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే వృద్ధులకు సాయంగా ఇద్దరు అటెండర్లు ఉంటే మంచిది.

-డాక్టర్ రవిప్రభు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్





రుయాస్పత్రిలో వైద్యం కోసం వృద్ధుల క్యూ

గ్రామీణులూ.. ఆరోగ్యం భద్రం





వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రత్తలు తగ్గి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన తగిన ఆరోగ్య జగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బందితోపాటు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ వారి ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాము. అవసరమైన చోట వెంటనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

-డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి



ఆపత్కాలంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు ఎనలేనివి





ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి

● యువజన, క్రీడల శాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆపత్కాల పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. యువతలో ఐక్యత, క్రమశిక్షణ పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. తిరుపతి నగరం ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని (2ఏ)ఆర్‌అండ్‌వీ రెజిట్ ఎన్‌సీసీ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఎంతో శ్రమించారని గుర్తుచేశారు. లెఫ్టినెంట్ కల్నల్ అనుప్, కల్నల్ సతీందర్ దహియా, వెటర్నరీఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీరమణ, అధికారులు, ఎన్‌సీసీ యూనిట్ల ఆర్మీసిబ్బంది, సివిల్‌సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మెజెస్టిక్ ఆర్మీ గుర్రంపై క్యాడెట్లు దూకడం.. ఆర్మీగుర్రాలు గుడ్‌లక్, రోమన్‌ఫామ్, గగన్, రాణిపై జంపింగ్ విన్యాసాలు.. ఒకచేత్తో ఈటెతో దూసుకుపోతూ మరోచేత్తో గుర్రాన్ని అదుపు చేస్తూ చేసిన టెంట్ పెగ్గింగ్ ప్రదర్శన.. ఫైర్‌జంప్ వంటి గుర్రపుస్వారీలను క్యాడెట్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

సత్ఫలితాలిస్తున్న 'మొబైల్ హంట్'

● రూ.87 లక్షల విలువైన 435 సెల్‌ఫోన్ల రికవరీ



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మొబైల్ హంట్' సేవలు సత్ఫలితాలిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.87 లక్షల విలువ చేసే 435 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు 11 విడతల్లో 3840 సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామని వివరించారు. ప్రస్తుతం 12వ విడతలో నెల రోజుల వ్యవధిలో 435 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. సైబర్ క్రైం పోలీసుల పనితీరు వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఎవరైనా తమ మొబైల్ ఫోను పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా వెంటనే మొబైల్ హంట్ నెంబరు 94906 17873 కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. దీనికి వచ్చే లింకులో వివరాలు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అపరిచితులు విక్రయించే సెల్‌ఫోన్లను ఎవరూ కొనొద్దని సూచించారు. ప్రస్తుతం ఈ సెల్‌ఫోన్లను కేరళ, ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి రికవరీ చేశామని తెలిపారు. ఈ రికవరీలో ప్రతిభ చూపిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ల్యాబ్ సీఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజలకు సత్వరమే పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం 'జిల్లా పోలీసు వెబ్‌సైట్‌'ను ప్రారంభించారు. ఇకపై పారదర్శకత, జవాబుదారీతనం, పౌర స్నేహపూర్వక పోలీసింగ్ విధానం అలవాటు అవుతుందన్నారు. జిల్లా పోలీసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

అయ్యో.. తల్లి..!



చేతి గాయానికి కట్టు. నడవలేని స్థితి. నోటి మాటా సరిగా రాలేదు. దీనస్థితిలో ఉన్న ఈ 70 ఏళ్ల వృద్ధురాలిని బుధవారం తిరుపతిలోని రుయాస్పత్రిలో వదిలేశారు. ఈమెను ఉదయం ఓ వ్యక్తి ఆటోలో రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చాడు. అక్కడ వైద్యసిబ్బందికి ఆమె కుమారుడినని చెప్పాడు. ఓపీ తెమ్మంటే.. తెస్తానంటూ వెళ్లిన వాడు మళ్లీ రాలేదు. అత్యవసర విభాగంలోని వైద్యులు ఆమెను పరీక్షించగా.. చేతికి తీవ్ర గాయాలున్నట్లు గుర్తించారు. మందు రాసి కట్టుకట్టారు. ఆమె వెంట వచ్చిన వ్యక్తి కోసం సిబ్బంది విచారించారు. ఎవరూ లేకపోవడంతో మధ్యాహ్నం వరకు అత్యవసర విభాగంలో ఉంచి అనంతరం బయటకు పంపేశారు. నడవలేని స్థితిలో ఉన్న ఆ తల్లి.. అత్యవసర విభాగం ముందు ఓ చెట్టు కింద నిస్సహాయంగా కూలబడ్డారు. చలికి వణుకుతూ.. చిన్నపాటి చినుకులకు తడుస్తూ తనవారి కోసం నిరీక్షిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది, స్థానికులు నిన్ను ఎవరు తీసుకొచ్చారని అడిగితే.. నా కొడుకు అనే సమాధానం తప్ప ఇంకేమీ చెప్పలేదు. చెప్పేందుకూ ఇష్టపడలేదు. పదే పదే అడిగితే నన్ను ఇలాగే వదిలేయండి అంటూ చెమ్మగిల్లిన కన్నీళ్లతో ప్రాధేయపడ్డారామె. ఆమె పరిస్థితికి చలించిన సెక్యూరిటీ సిబ్బంది.. చిన్నపాటి దుప్పటి, నీరు, కొంచెం ఆహారం అందించారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

21 నుంచి లా స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ నిర్వహించే వివిధ లా కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 21వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. 27వ తేదీ దాకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. లాసెట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులు. మూడు, ఐదేళ్ల డిగ్రీ కోర్సులతో పాటు రెండేళ్ల పీజీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వీటి భర్తీకి ఈ అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో లా విభాగంలో సంప్రదించవచ్చునని పీఆర్వో శ్రీరజని తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. గూడూరు పట్టణం మాళవ్యానగర్ ప్రాంతానికి చెందిన జనార్దన్ చిల్లర దుకాణం నిర్వహించేవాడు. 2020 సెప్టెంబరులో పదకొండేళ్ల బాలిక సరుకులు కొనేందుకు దుకాణానికి రాగా అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో బుధవారం నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడు జనార్దన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

ప్రగతి అంటే ఇదీ!



27 ఏప్రిల్ 2016

శ్రీసిటీ సెజ్‌లో ఇసుజు కర్మాగారాన్ని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రారంభించారు. వాహనాల ఉత్పత్తి మొదలైంది.



శ్రీసిటీలోని ఇసుజు ప్లాంట్



18 డిసెంబరు 2024

శ్రీసిటీలో ఉత్పత్తి చేసిన ఇసుజు లక్షవ వాహనాన్ని సగర్వంగా సంస్థ విడుదల చేసింది.

తొలి వాహనం తయారీకి ఇసుజు పూనుకున్నపుడు సీఎంగా ఉన్న చంద్రబాబే.. లక్షవ వాహనం ఉత్పత్తి సమయంలోనూ తిరిగి అదే స్థానంలో ఉండడం విశేషం. వస్తు రవాణాకు విశేషంగా ఉపయోగపడే వాహనాలను శ్రీసిటీలో 107 ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమ ఏర్పాటైంది. 1600 మంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. డి-మాక్స్, ఎంయు-ఎక్స్ ఎస్‌యూవీలను ఇసుజు మోటర్స్ ఇండియా పరిశ్రమ ఉత్పత్తి చేస్తోంది. పలు దేశాలకు వీటిని ఎగుమతి చేస్తోంది. ఇప్పటికే లక్ష వాహనాలు ఈ పరిశ్రమలో తయారయ్యాయి. బుధవారం లక్షవ వాహనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ జపనీస్ కంపెనీ గ్రూప్ చైర్మన్ సాడో గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పరిశ్రమల శాఖ మంత్రి టీడీ భరత్ అభినందన సందేశాలను యువరాజ్ వినిపించారు. ఇసుజు ఇంజనీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా చైర్మన్ సుకామోటో ఐఎంఐ వృద్ధి ప్రయాణాన్ని వివరించారు. ఇసుజు మోటర్స్ ప్రెసిడెంట్ సీవోవో షిన్‌సుకే మినామి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అండ్ గ్రూప్ సీఈవో షిగేరు వాకబయాషీ వర్చువల్ విధానంలో ఇసుజు టీంను అభినందించారు.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి

ఇసుజు సంస్థ నాణ్యత, నిబద్ధతకు ఇది నిదర్శనం. నైపుణ్యం కలిగిన మానవ శక్తి, అధునాతన సాంకేతికత, అత్యుత్తమ పనివిధానాల ద్వారా దీనిని సాధించాం. సంస్థలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డిప్లొమా హోల్డర్ల ప్రతిభ గొప్పది. శ్రీసిటీ సహకారం ఎనలేనిది.

- ఐఎంఐ అధ్యక్షుడు, ఎండీ రాజేష్ మిట్టల్

దేశీయ తయారీ నైపుణ్యం, ప్రపంచ పోటీతత్వానికి సాక్ష్యం ఇది. ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షిస్తూ నూతన ఆవిష్కరణలు, ఉద్యోగ కల్పన, వృద్ధి సాధన దిశగా మంచి పర్యావరణ వ్యవస్థను నిర్మించడంతో ఆంధ్రప్రదేశ్ అంకితభావంతో ఉంది. స్థానిక ప్రతిభను ఇసుజు ప్రోత్సహించడం గ్రేట్. వెనుకబడిన ప్రాంతంలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి అభినందనలు.

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్

ప్రపంచస్థాయి పారిశ్రామిక హబ్‌గా శ్రీసిటీ పాత్ర గర్వకారణంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న మొదటి ఆటోమొబైల్ తయారీదారు ఇసుజు. ఇసుజు విజయం శ్రీసిటీలోని పెట్టుబడుల స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థకు అద్దం పడుతూ స్ఫూర్తినిస్తోంది.

- శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

ఎకరా వరికి రూ.84తో బీమా

● జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ



క్షేత్రస్థాయిలో జీవామృతం తయారీపద్ధతులను రైతులకు వివరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బంగారుపాళ్యం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎకరా వరి పంటకు బీమా కోసం రూ.84 మీసేవా కేంద్రంలో చెల్లించి రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని తుంబకుప్పంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ద్వారా అమలయ్యే పథకాల గురించి రైతులకు తెలిపారు. భూసార పరీక్షలు, వరి పంటలో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం, జీవామృత తయారీ విధానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు చూపించారు. ఉద్యానశాఖ ద్వారా అమలయ్యే పథకాల గురించి, సెరికల్చర్ శాఖ పథకాల గురించి వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీగా చిన్నికృష్ణ



చిత్తూరు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ఏఆర్ డీఎస్పీగా బి. చిన్నిక్రిష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై చిత్తూరు జిల్లాకు వచ్చారు. 1992లో విధుల్లో చేరి 2001లో ఆర్ఐగా ప్రమోషన్ పొంది చిత్తూరులో అడ్మిన్ ఆర్ఐగా విధులు నిర్వహించారు. బదిలీపై గ్రేహౌండ్స్‌కు వెళ్లి 2004లో జరిగిన ఆపరేషన్‌లో ప్రతిభ కనబరిచినందుకు ప్రెసిడెంట్ మెడల్‌ను పొందారు. 2012లో డీఎస్పీగా ప్రమోషన్ పొంది కడప, గుంటూరు, పల్నాడులో విధులు నిర్వహించి అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై చిత్తూరు జిల్లాకు వచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలి

● విజిలెన్స్ సీజీఎం ఆదిశేషయ్య



సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ సీజీఎం ఆదిశేషయ్య

చిత్తూరు రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజిలెన్స్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్య, ఎస్ఈ శ్రీనివాసబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో రెవెన్యూ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షల రూపాయల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల కారణంగా విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లోనే అధికంగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని, వీటి నివారణకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పొలాల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న కొత్తవారి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ ప్రతి నెల నిర్దేశిత సమయంలోపు బిల్లింగ్ పూర్తి చేసి, వంద శాతం రెవెన్యూ వసూలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాడైన మీటర్ల స్థానంలో వెంటనే కొత్తవి అమర్చాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైతే 48 గంటల్లోగా మరొకటి అమర్చాలని తెలిపారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో ఏవో ఫైనాన్స్ ఆంజనేయ ప్రసాద్, డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పీహెచ్‌సీలో తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయాలి

● కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా టీబీ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వైద్య అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో టీబీ టెస్టింగ్ తప్పనిసరిగా చేయాలని, క్యాన్సర్ స్క్రీనింగ్, ఆర్బీఎస్కే స్క్రీనింగ్ చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద గర్భిణుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని చెప్పారు. పిల్లలందరికీ వందశాతం వ్యాధినిరోధక టీకాలను తప్పక వేయించాలని ఆదేశించారు. జననీ సురక్ష యోజన కింద ప్రభుత్వం ఇచ్చే నగదు ప్రోత్సాహకాన్ని పొందడంలో సమస్యలు లేకుండా ఏఎన్ఎం, ఆశాలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, డీసీహెచ్ఎస్ ప్రభావతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఆర్బీఎస్కే కోఆర్డినేటర్ శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విండోల కంప్యూటరీకరణపై రేపట్నుంచి శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండోల) బలోపేతంపై ఈనెల 20, 21 తేదీల్లో స్థానిక డీసీసీబీ ప్రధాన కార్యాలయ ఆవరణలో కంప్యూటరీకరణ అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు డీసీఏవో బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 20న చిత్తూరు జిల్లాలోని 37 విండోలు, 21న తిరుపతి జిల్లాలోని 23, అన్నమయ్య జిల్లాలోని 15 విండోలకు సంబంధించి శిక్షణా తరగతులు జరుగుతాయని చెప్పారు. ఇందులో సహకారశాఖకు చెందిన ఆడిటర్లు, విండోల సీఈవోలు, సూపర్‌వైజర్లు, డీసీసీబీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు పాల్గొంటారని తెలిపారు. సింగిల్ విండోల ఆన్‌లైన్, ప్రీ మైగ్రేషన్ ప్రక్రియ ముగిసిందని, ప్రస్తుతం గో ఆన్ లైవ్ ప్యారలల్ రన్ అంశాలు జరుగుతున్నట్లు చెప్పారు. 2024 ఏప్రిల్ నుంచి డిసెంబరు నెలవరకు విండోల్లో జరిగిన అన్నిరకాల లావాదేవీలపై, కంప్యూటరీకరణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పనితీరుపై శిక్షణ జరుగుతుందని వివరించారు. ఇందులో సహకారశాఖకు చెందిన అధికారులు కూడా పాల్గొంటారని చెప్పారు.

ఏఆర్‌టీ సెంటర్ పరిశీలన



చిత్తూరులోని ఏఆర్‌టీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేడీ మంజుల

చిత్తూరు రూరల్, డిసెంబరు 18: చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న ఏఆర్‌టీ కేంద్రాన్ని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీస్యాక్స్) జేడీ మంజుల బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లా ఏఆర్‌టీ కేంద్రాన్ని ప్రభుత్వంతో కలిసి అపోలో యాజమాన్యం నిర్వహిస్తోందని, జనవరి 1వ తేది నుంచి విడివిడిగా ఏఆర్‌టీ కేంద్రాలను నిర్వహించాలని ఆదేశించారు. అపోలో వారికి జిల్లాలోని ఏడు మండలాలను అప్పగించి, మిగిలిన మండలాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. అనంతరం కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆమె వెంట జిల్లా టీబీ, ఎయిడ్స్ నివారణ అధికారి వెంకటప్రసాద్, అపోలో సూపరింటెండెంట్ సుధాకర్, ఏవో రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం అభివృద్ధి పనులకు రూ.5.20 కోట్లు మంజూరు

కుప్పం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.5.20 కోట్లు మంజూరు చేసింది. ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కడా రూ.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా రూ.5.20 కోట్లు మంజూరయ్యాయి. 14వ వార్డులో కుమ్మర అమరగడ్డ (పచ్చి కుండలు కాల్చే ప్రదేశం)కు ప్రహరీ నిర్మాణానికి రూ.40 లక్షలు, కుమ్మర కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.1.15 కోట్లు, షాదీ మహల్ ప్రహరీ నిర్మాణానికి రూ.3.65 కోట్లు కేటాయించారు.కుమ్మర కమ్యూనిటీ భవనానికి మున్సిపల్ పరిధిలో స్థలాన్ని సేకరించాల్సి ఉంది.

టెంపో డ్రైవరు నిర్లక్ష్యంతో ఐదుగురు కూలీల మృత్యువాత





బోల్తా పడిన టెంపో - అలివేలమ్మ(ఫైల్‌ఫొటో)

పుంగనూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పుంగనూరుకు 20కిలోమీటర్ల దూరంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతం కోలారు జిల్లా ముళబాగిలు తాలూకాలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు కూలీలు దుర్మరణం పాలయ్యారు.ఆంబ్లికల్ సమీపంలోని గుడిపల్లి మెయిన్‌రోడ్డుపై మూడు ద్విచక్రవాహనాలను బొలెరో టెంపో బుధవారం సాయంత్రం ఢీ కొంది.ఈ ప్రమాదంలో సమీప గ్రామంలోని పొలంలో కూలీ పనులు ముగించుకుని స్వగ్రామానికి బయల్దేరిన నలుగురు పురుషులు, ఒక మహిళ మృతి చెందారు.మృతులను ముళబాగిలు తాలూకా నాగసహళ్ళికి చెందిన వెంకటరవణప్ప (50), ఆయన భార్య గాయత్రి(39), కోణనకుంటె గ్రామానికి చెందిన చిక్క వెంకటరామప్ప (52), ఆయన భార్య అలివేలమ్మ (42), రాధప్ప (52)గా గుర్తించారు.బొలెరో వాహన డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఘటనపై నంగలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అభ్యసనా సామర్థ్యాల పెంపునకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



ఎంవోయూ పత్రాలను చూపుతున్న సంస్థ ప్రతినిధులు, కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాల పెంపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యాశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో వన్ స్కూల్ అట్ ఏ టైం (ఓఎస్ఏటీ) సంస్థ సీఈవో వాదిరాజ్‌భట్, స్ట్రాటజీ అడ్వైజర్ కేదార్ శాస్త్రి (రిటైర్డ్ ఐఏఎస్)లతో జిల్లా విద్యాశాఖ తరపున కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంవోయూ చేసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల్లోని విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అభ్యసనా సామర్థ్యాలు పెంపులో సంస్థ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన 22 పాఠశాలల్లో ఉపాధ్యాయులు, 6-9 తరగతి విద్యార్థులను ఎంపిక చేసుకుని విడివిడిగా శిక్షణా తరగతులను ఈ సంస్థ నిర్వహిస్తోందన్నారు. సంస్థ చేపట్టే ప్రాజెక్టు వివరాలను ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఈవో వరలక్ష్మి, ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణారెడ్డి, వన్ స్కూల్ అట్ఏ టైమ్ డైరెక్టర్ శృతి, జేటీడీ ధనుంజయ్, ఎంఈవోలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఛాంపియన్ పద్మావతి పాలిటెక్నిక్



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ మహమ్మద్, అధ్యాపకులు

పలమనేరు, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో రెండురోజులపాటు జరిగిన పాలిటెక్నిక్ విద్యార్థినుల ఆటలపోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ పాల్గొన్నారు. క్రీడలకు సహకరించిన అధ్యాపకులకు, పలమనేరు, గంగవరం పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లకు, అభినందనలు తెలిపారు. పోటీల్లో తిరుపతిలోని పద్మావతి పాలిటెక్నిక్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకుంది

పోటీల ఫలితాలు

వంద మీటర్ల రన్నింగ్‌లో ఎస్వీ పాలిటెక్నిక్(తిరుపతి) విద్యార్థిని బి.బిందుశ్రీ, పి.మౌనిక, తిరుపతిలోని పద్మావతి పాలిటెక్నిక్ విద్యార్థిని కె, అశ్విని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 200 మీటర్ల రన్నింగ్‌లో ఎస్వీ పాలిటెక్నిక్ విద్యార్థిని బి. బిందుశ్రీ, పద్మావతి విద్యార్థిని పి.శిరీష, పలమనేరు విద్యార్థిని సి.భవిత, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 400 మీటర్ల రన్నింగ్‌లో చంద్రగిరి విద్యార్థిని షణ్ముఖప్రియ, పలమనేరు విద్యార్థిని పూజిత, టి.శిరీష మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 800 మీటర్ల రన్నింగ్‌లో చంద్రగిరి విద్యార్థిని షణ్ముఖప్రియ, పలమనేరు విద్యార్థిని పూజిత, కె.కస్తూరి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గేమ్స్‌లో పద్మావతి పాలిటెక్నిక్ ఛాంపియన్ షిప్ సాధించింది.స్పోర్ట్సులో పలమనేరు పాలిటెక్నిక్ ఛాంపియన్ షిప్ సాధించింది. చంద్రగిరి విద్యార్థిని షణ్ముఖప్రియ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ సాధించింది. తిరుపతి పద్మావతి పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకుంది. తొలిసారిగా అధ్యాపకులకు కూడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహిళా పాలిటెక్నిక్ అధ్యాపకులకు బాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించారు. సింగిల్స్‌లో తిరుపతి పాలిటెక్నిక్‌కు చెందిన లక్ష్మీశిల్ప విన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో ఎస్వీ పాలిటెక్నిక్ అధ్యాపకులు లక్ష్మీశిల్ప, గౌరీ విన్నర్స్‌గా నిలిచారు.



డప్పులు వాయిస్తూ.. - ఉగ్రరూపిణి ఊరేగింపు

ముగిసిన గంగ జాతర



మదన వేషధారుల విన్యాసాలు



వెదురుకుప్పం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో రెండురోజుల గంగ జాతర బుధవారంతో ముగిసింది.కోలాటం, చెక్క భజనలు,వివిధ రకాల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర వైభవం కొనసాగింది. నడి వీధి గంగమ్మ భక్తులకు ఉగ్రరూపిణిగా కనిపించింది.నడి వీధి గంగమ్మ, బంగారమ్మ ఊరేగింపు సందర్భంగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చారు.

సత్ఫలితాలొస్తున్నాయ్

● ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రానికి స్పందన

● ఇకపై వారానికి రెండ్రోజులు నిర్వహణ



కౌన్సెలింగ్ ఇస్తున్న టీమ్ సభ్యులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యుల మధ్య తలెత్తే మనస్పర్థలను పరిష్కరించి, తిరిగి కలపాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం సత్ఫలితాలను సాధిస్తోంది. ఈ ఏడాది జూలై 12వ తేదీన చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్‌లో ఎస్పీ మణికంఠ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. వారంలో ప్రతి బుధవారం భార్యాభర్తలు, తల్లిదండ్రులు, అన్నాతమ్ముళ్లు ఇలా కుటుంబ సభ్యుల మధ్య ఏ సమస్య తలెత్తినా ఆయా పోలీసుస్టేషన్ల నుంచి ఈ కేంద్రానికి సిఫార్సు చేస్తారు. ఇక్కడి ఎస్ఐలు నాగసౌజన్య, కరీమున్నీసా, అడ్వకేట్ మేరీ, మానసిక వైద్యురాలు డాక్టర్ జయప్రియ, ఎన్‌జీవో ప్రతినిధి భూదేవి, రిటైర్డు ఎస్ఐ రషీద్, పోలీసు సిబ్బంది ఉంటారు. వీరు కుటుంబ సమస్యలను పరిష్కరించడమే కాకుండా.. మహిళలపై జరిగే హింసను, గొడవలను తగ్గించడంపైనా సలహాలు ఇస్తారు. ఈ కేంద్రానికి రోజు రోజుకూ అర్జీదారుల సంఖ్య పెరగడంతోపాటు సత్ఫలితాలు వస్తున్నాయని ఎస్పీ గుర్తించారు. ఆయన ఆదేశాలతో ఇకపై వారంలో రెండ్రోజులపాటు అంటే బుధ, శనివారాల్లో కౌన్సెలింగ్ ఇస్తామని ఎస్ఐ నాగశైలజ తెలిపారు.

ఆరు నెలల్లో అర్జీల వివరాలు

- అందినవి : 97
- రాజీపడినవి: 42
- డొమెస్టిక్ వయోలెన్స్ సెంటర్‌కు బదిలీ అయినవి: 8
- ఎఫ్ఐఆర్ నమోదు: 4
- కోర్టుకు బదిలీ అయినవి: 15
- పెండింగ్‌లో ఉన్నవి: 28

ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సోమలలో 4.6మిమీ, తవణంపల్లెలో 2.8, యాదమరిలో 2.6, చిత్తూరులో 1.8, సదుంలో 1.2, పుంగనూరులో 1, పూతలపట్టులో 0.2 మిమీ వర్షపాతం నమోదైంది.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి.బుధవారం 39 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు.387 అర్జీలందాయి.ఆర్వోఆర్‌కు 240, ఇతరత్రా అంశాలపై 86, రీసర్వే కోసం 13, ఇళ్ల స్థలాలకోసం 10, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 16, 22ఏ కింద మార్పులు చేర్పుల కోసం 5 అర్జీలు అందాయి.

ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్

తిరుపతి(నేరవిభాగం)/నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లాలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్య ధోరణి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జి.చంద్రయ్య కొంతకాలంగా క్రమశిక్షణ లోపించి ప్రజలు, పిటిషనర్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. నాలుగు రోజుల కిందట ఈయన చిట్టమూరు మండలం కొత్తగుంట గ్రామంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో యువకుడు పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఆ యువకుడు చిట్టమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చంద్రయ్యపై కేసు నమోదైంది. దీంతో చంద్రయ్యను ఎస్పీ సస్పెండ్ చేశారు. అలాగే, తిరుపతి సాయుధ దళం విభాగంలో విధులు నిర్వహిస్తున్న బి.రవికుమార్ క్రమశిక్షణ లోపించడం, ఇతర ఆరోపణలపై సస్పెండయ్యారు. పోలీసులు విధి నిర్వహణలో అలసత్వం, ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు నేడు తెల్పండి

డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాలోని అభ్యంతరాలను గురువారం సాయంత్రం 4 గంటలలోపు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతుల్లో మున్సిపాలిటీల్లో గ్రేడ్2 హెచ్ఎం, ఎస్ఏ మ్యాథ్స్ (తెలుగు), ఎస్ఏ ఫిజికల్ సైన్స్ (తెలుగు), మున్సిపల్ కార్పొరేషన్‌లో గ్రేడ్2 హెచ్ఎం, ఎస్ఏ ఇంగ్లీషు, ఎస్ఏ మ్యాథమెటిక్స్, ఎస్ఏ ఫిజిక్స్, ఎస్ఏ బయాలజీ, ఎస్ఏ సోషియల్, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ క్యాడర్లు ఉన్నాయని తెలిపారు.

వసతిగృహాల మరమ్మతుల నాణ్యతల్లో రాజీ వద్దు : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గృహాల మరమ్మతుల నాణ్యతలో రాజీపడొద్దని ఇంజనీరింగ్ శాఖ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారంరాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, సమగ్రశిక్ష శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థుల పట్ల సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మరమ్మతులకోసం భారీగా నిధులు కేటాయించారని తెలిపారు. జిల్లాలో 48 వసతిగృహాల మరమ్మతుల కోసం రూ.8 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. వసతిగృహాల్లో రన్నింగ్ వాటర్‌తో కూడిన మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ వైరింగ్, విద్యుదీకరణ, కిటికీలు మెష్, అన్ని గదులకు భద్రతకోసం తలుపుల ఏర్పాటు, బాలికల వసతిగృహాలకు కాంపౌండ్ వాల్స్ నిర్మాణం తదితర అంశాలకు ఇదివరకే ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారని చెప్పారు. మరమ్మతులకోసం జనవరి 10లోగా టెండర్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘికసంక్షేమ శాఖ అధికారిణి రాజ్యలక్ష్మి, పీఆర్ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట్రమణారెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవోలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గజదాడులు



ఏనుగులు తొక్కేసిన ధాన్యం

సోమల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):సోమల మండలంలో ఏనుగుల విధ్వంసం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి నెలుకూరివారిపల్లె సమీపంలో ఏనుగుల మంద బండపై నిల్వ చేసిన ధాన్యాన్ని తొక్కివేసి రైతులను నష్టపరిచాయి. నెల కిత్రం ఈప్రాంతంలోనే ఏనుగుల గుంపు టమోటా, వరి పంటలను ధ్వంసం చేశాయి. ఆవులపల్లె రాంపల్లె బీట్‌లో మూడు ఏనుగులు తమవరి పంటను ధ్వంసం చేసినట్లు కొత్తూరుకు చెందిన శంకర్, వెంకట్రాజు తెలిపారు. కొబ్బరిచెట్లను కూడా ధ్వంసం చేశాయి. డ్రిప్ పైపులను తొక్కేశాయి. అరకొరగా సాగు చేసిన టమోటా తోటల్లోని ఊతంగా నాటిన కర్రలను తొక్కివేయడంతో రైతులు నష్ట పోతున్నారు. రాశెట్టివారిపల్లె, దాసరివారిపల్లె, వడ్డిపల్లె అటవీ శివారు పొలాల వైపు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు. ఇరకిపెంట సమీపంలోని మధురమలై కొండలో తాగునీటి నిల్వల కోసం పగలు మకాం వేస్తూ రాత్రి సమీప పొలాల్లో దాడులు చేస్తున్నాయి.

గ్రామాల్లో జోరుగా రెవెన్యూ సదస్సులు

చౌడేపల్లె, డిసెంబరు18.(ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఈ సదస్సుల దారా భూ వివాదాలను పరిష్కరించాలని సంకల్పించిన నేపథ్యంలో స్పందన బాగుందని అధికారులు చెబుతున్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డీటీ మాధవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దకొండామారిలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై 22 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. **రొంపిచెర్ల:** చిచ్చిలివారిపల్లెలో రెవిన్యూ సదస్సు తహసిల్దార్ కిరణ్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 45 రోజుల లోపు పరిష్కార చర్యలు తీసుకొంటామన్నారు. **రామకుప్పం:** వీర్నమలలో జరిగిన రెవెన్యూ సదస్సులో టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయక్, తహ శీల్దారు బాబులు మాట్లాడారు. వి.కోట, ముదరందొడ్డిలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ కోరారు. పరిష్కారంలో సహకరించాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

చౌడేపల్లె, డిసెంబరు18,(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలివి. దిగువపల్లె పంచాయతీకి చెందిన గట్టువారిపల్లెకు చెందిన గంగప్ప, గంగులమ్మలు తమ మనవడు ప్రసాద్‌ను ఆధార్ దిద్దుబాటు కోసం పుదిపట్ల వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో రోడ్డులో నిలిచిఉన్న ప్రసాద్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవానంలో ఢీకొన్నారు. ప్రసాద్‌కు కాలు రెండు చోట్ల విరిగింది. మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. చిట్రెడ్డిపల్లెకు చెందిన వాసుదేవ రెడ్డి, అంజప్పలు చౌడేపల్లెకు ద్విచక్రవాహనంలో వచ్చారు. తిరుగు ప్రయాణంలో చౌడేపల్లె సమీపంలోని అనంతరాయ చెరువు కట్ట వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. వాసుదేవరెడ్డి , అంజప్పలకు తీవ్రగాయాలైనాయి. స్థానికులు వీరికి స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

అటవీ, రెవెన్యూ సరిహద్దుపై సర్వే



రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటిస్తున్న జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి

చౌడేపల్లె, డిసెంబరు18.(ఆంధ్రజ్యోతి): అటవీ, రెవెన్యూ సరిహద్దులను జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి పరిశీలించారు. బుధవారం మండలంలోని బోయకొండ, తవలం సరిహద్దు అటవీ ప్రాంతాల సరిహద్దులను జిల్లా, మండల రెవెన్యూ అధికారులతో కలసి సర్వే చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..అన్నమయ్య జిల్లా, చిత్తూరు జిల్లాల సరిహద్దుగా బోయకొండ అటవీ ప్రాంతం, తవలం రిజర్వ్ ఫారెస్టు మధ్యలో ఉండటంతో ఉమ్మడిసర్వే నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా సర్వేయర్ జయరాజ్, డిఐవోఎస్ కృష్ణమూర్తి, డీటీ మాధవి, మండలసర్వేయర్ గుణశేఖర్, సర్వేయర్లు నీలిమ, ఉస్మాన్‌గని, చంద్రశేఖర్, అనిల్, ఎఫ్ఆర్‌వో శ్రీరాములు, ఎఫ్ఎస్‌వో రాకేష్, ఎఫ్‌బీవో యువరాజ్, కిశోర్ లు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధికి శిక్షణ తరగతులు

రొంపిచెర్ల,డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి) సుస్థిర అభివృద్ధి సాధించేందుకు శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. బుధవారం రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శలకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు.

జెండర్ క్యాంపెయిన్‌లో రేణుకకు ప్రథమస్థానం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జెండర్ క్యాంపెయిన్ పోటీల్లో చిత్తూరు ఎస్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో థర్డ్ ఎంఎస్సీ చదువుతున్న ఎం.రేణుక ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం



తులసినాథంనాయుడు

పలమనేరు, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): తెలుగసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి. తులసినాథం నాయుడికి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు నిర్వాహకులు ఆహ్వానం పంపారు. ఈనెల 28,29 తేదీల్లో విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరుగనున్నాయి. 29న జరిగే సభలో తెలుగు భాషరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి మాట్లాడాలని తులసినాథంనాయుడును కోరుతూ నిర్వాహకులు గుత్తికొండ సుబ్బారావు,పూర్ణచంద్రులు ఆహ్వానపత్రిక పంపారు.

రేపు విరూపాక్షమ్మ ఆలయ వార్షికోత్సవం

కల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ దిగుమూర్తివారిపల్లిలో విరూపాక్షమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవం వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త గురుస్వామి తెలిపారు. ఉదయం కళశపూజతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు.వేడుకలు రాత్రి వరకు కొనసాగుతాయన్నారు.

నాణ్యత లేకుంటే బిల్లులు మంజూరు కావు

సోమల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోతే బిల్లులు మంజూరు కావని ఎంపీడీవో నారాయణ అన్నారు. బుధవారం మండలంలో పలు చోట్ల సీసీ రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరగా చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గోకులాల పనులు వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో దినకర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత ఎంపీడీవో మృతి



రామమ్మ

పుంగనూరు రూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఎ ంపీడీవోగా పనిచేసి రిటైరైన రామమ్మ(65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. పుంగనూరులోనే 35ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించారు. స్వగ్రామమైన చుక్కలనిడిగల్లులో మృతి చెందారు. ఆమె మృతికి ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

కేఈసీ విద్యార్థి దివ్యశ్రీకి అభినందన



దివ్యశ్రీని అభినందిస్తున్న సునీల్‌రాజ్ తదితరులు

కుప్పం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్‌యూ పరిధిలో నిర్వహించిన ఇంటర్ యూనివర్శిటీ ఉమెన్స్ వాలీబాల్ టీంకు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని దివ్యశ్రీ ఎంపికైంది. నెల్లూరు జిల్లా కావలిలోని రామిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల ఈమె ఎంపికైంది. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఉమెన్స్ షటిల్ బ్యాట్‌మింటన్ టీం సెలక్షన్స్‌లో కుప్పం నర్సింగ్ కళాశాల విద్యార్థిని మిన్ను జె.షైన్ ఎంపికైంది. వీరిని కళాశాలలో బుధవారం బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్‌రాజ్, సీఈవో సాగర్‌రాజ్‌అభినందించారు. ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, సతీశ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి: ఎంపీడీవో

పుంగనూరు రూరల్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారుల సమష్టిగా కృషి చేస్తే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ట్రావెల్స్‌బంగ్లాలోని జడ్పీ గెస్ట్‌హౌస్‌లో సర్పంచులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలను వారికి వివరించారు. అధికారులతో గ్రామాల అభివృద్ధి చేయడంతో అందరి బాధ్యత ఉందంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఏవో రెడ్డెమ్మ, సీడీపీవో రాజేశ్వరి, డాక్టర్ సల్మాబేగం, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అందుబాటులోకి తెస్తే రైతులకు కొండంత అండ



మార్కెట్ యార్డు ముఖద్వారం



యార్డులో నిర్మించిన మండీల సముదాయం

సోమల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దాదాపుగా పూర్తికావచ్చిన వ్యవసాయ మార్కెట్‌యార్డును అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు. సదుం , సోమల మండలాల రైతుల కోసం 1996లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి సోమల సింగిల్ విండో కార్యాలయంలోని అద్దె గదిలోనే కమిటీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 15 ఏళ్ల కిత్రం పుల్లయ్యతాత కుంట వద్ద మార్కెట్ యార్డు నిర్మాణానికి పదెకరాలు సేకరించారు. తర్వాత నిధులు మంజూరయ్యాయి. నాలుగేళ్ల వ్యవధిలో నిర్మాణ పనులు చిన్నపాటి పనులు మినహా నిర్మాణం పూర్తయింది. ఈఏడాది ఎన్నికల ముందు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి యార్డును ప్రారంభించారు. ఇందులో రైతుల వ్యాపార కలాపాలకు గదులను నిర్మించారు. టమోటా, మామిడి, చింత మండీలు ఏర్పాటు చేశారు. సిమెంట్ రోడ్లు వేశారు. అయితే ఇందా వ్యాపారస్తులకు గదుల కేటాయించలేదు. సోమల, సదుం మండలాల్లో టమోటా, మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. ఇక్కడి రైతులు తమ వ్యవసాయ ఉత్తత్తులను వ్యయ ప్రయాసలకోర్చి దూరంగా ఉన్న మార్కెట్లకు తరలిస్తున్నారు. దీనివల్ల నష్టపోతున్నారు. ఇక్కడి యార్డులో గోడౌన్ల సౌకర్యముంది. చిన్నపాటి పనులను పూర్తిచేసి మండీలో షాపులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

దామలచెరువుకు వెళ్లాల్సి వస్తోంది



యార్డులో కొనుగోళ్ళు జరిగేలా చర్యలు తీసుకోవాల్సింది . ఐదెకరాల్లో మామిడి తోట ఉంది. ఏటా దామలచెరువు మార్కెట్‌కు వెళ్తున్నాం. రవాణా ఖర్చు అధికంగా ఉంది సోమలలో కొనుగోలు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.
-తమ్మిశెట్టి సోమశేఖర్, సోమల

ఈ సీజన్‌లోనైనా ప్రారంభించాలి



పదెకరాల్లో టమోటా సాగు చేస్తున్నాం. సోమలలో మార్కెట్ యార్డులో కోలారు, పలమనేరు, వడ్డిపల్లె, పుంగనూరుకు వెళ్లి సరకు అమ్ముతున్నాం. రవాణా ఖర్చులు పెరిగి. ఇబ్బందిగా ఉంది. ఈసీజన్‌కైనా యార్డులో కొనుగోళ్ళు సాగేలా అధికారుల స్పందించిచర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.
-మురళీ, కరకమంద

రవాణా భారం పెరిగిపోతోంది



పంటలను దూరప్రాంతాలకు తరలించాలంటే రవాణా భారంగా మారింది. సోమలలో యార్డు ప్రారంభిస్తే అనుకూలంగా ఉంటుంది. గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవచ్చు. యార్డులో నిర్మిస్తున్న అగ్రి ల్యాబ్‌ను ప్రారంభించాలి.
-పోకల రామచంద్ర, నూరయ్యగారివల్లె

పంట నమోదుతో రైతుకు ప్రయోజనాలు



ఉలవపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పలమనేరు, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ తప్పనిసరిగా పంటలను రైతుసేవాకేంద్ర సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ సూచించారు. బుధవారం టి.ఒడ్డూరు, ముసలిమడుగు గ్రామాల్లో వరి, ఉలవపంటలను మండల వ్యవసాయ అధికారి సంధ్య, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ రైతులతో మాట్లాడుతూ పంట నమోదుతో బీమా సౌకర్యం ఉంటుందన్నారు. సున్నావడ్డీ రుణాలు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు. పలమనేరు మండలంలో 1222 ఎకరాల్లో సాగైతే ఇప్పటి వరకు 360 ఎకరాల పంట నమోదైందన్నారు. నెలాఖరు లోపు వరి బీమా గడువు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు యామిని, కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

వైసీపీ మద్దతుదారుల ఆక్రమణకు అడ్డుకట్ట



ప్రభుత్వ స్థలంలో సిద్ధం చేసిన రోడ్డు

గంగవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అధికారం లేకున్నా వైసీపీ నాయకుల బరితెగింపు ఆగలేదు. గంగవరం సమీపంలో ఫ్లైఓవర్ సమీపంలో సర్వే నెంబరు 319 నెంబరు గల పరంబోకు స్థలంపై ఈ పార్టీ మద్దుతుదారుల కన్నుపడింది. ఇప్పటికే ఆ సర్వే నెంబరులో 10 మందికి పైగా గత ప్రభుత్వంలో పొజిషన్ సర్టిఫికెట్లు పొందారు. గ్రామస్థుల ఆందోళనతో అధికారులు ఈ సర్టిఫికెట్లను రద్దుచేశారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ సర్వేనెంబరులోని బండిబాట ద్వారా సిగరాకుచెరువు, శ్మశానానికి దారి ఉంది. తాజాగా కొందరు 20 అడుగుల వెడల్పుతో దీనిని తారురోడ్డు చేశారు. ఎక్సవేటర్లతో రోడ్డు విస్తరణ చేపట్టారు. ప్రజలు ఫిర్యాదు చేయడంతో బుధవారం రెవెన్యూ అధికారులు పనులను అడ్డగించారు. అత్యంత విలువైన ఈ భూమిని అక్రమించాలని ప్రయత్నిస్తే కేసు నమోదుచేస్తామని తహశీల్దార్ శివకుమార్ చెప్పారు

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు పుట్టినరోజును పురష్కరించుకొని బుధవారం పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చల్లాబాబు మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, నాయకులు కుమార్‌రెడ్డి, వెంకటరమణ, ధనంజయనాయుడు, మురళీనాయుడు, నూర్‌బాషా, ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెచ్ఎం శ్రీవాణి, ధాత శివ, పాల్గొన్నారు.

రేపు పెంపుడు కుక్కల ఆరోగ్య శిబిరం

బంగారుపాళ్యం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారుపాళ్యం ప్రాంతీయ పశువైద్యశాలలో 20న పెంపుడు కుక్కల ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ షేక్ ఆసిఫ్ తెలిపారు.

రెజిమెంట్ లెఫ్టినెంట్‌గా గుడుపల్లె యువకుడు



గణపతిని సత్కరిస్తున్న నరేష్ తదితరులు

కుప్పం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం కొడతనపల్లె పంచాయతీ సొలచింతనపల్లెకు చెందిన యువకుడు గణపతి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ద్వారా నేరుగా రెజిమెంట్ లెఫ్టినెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. శిక్షణ ముగించుకుని బుధవారం సొంత గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కుప్పం రైల్వే స్టేషన్‌లో రెజిమెంట్ లెఫ్టినెంట్ ఆఫీసర్ గణపతికి నియోజకవర్గ జనసేన కో-ఆర్డినేటర్ నరేష్‌తోపాటు పలువురు స్వాగతం పలికారు. గణపతి తల్లిదండ్రులను సత్కరించారు.

శ్మశానవాటిక దారి ఆక్రమణపై ఫిర్యాదు

సోమల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమిన్నానాయనపల్లె పంచాయతీలోని కురవపల్లెలో శ్మశానానికి దారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ బెన్నురాజ్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో పలు మార్లు భూములను అధికారులు సర్వే చేసి దారి సౌకర్యం కల్పించినా ఆక్రమణదారులను అడ్డుకోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భువనేశ్వరి పర్యటన జయప్రదం చేయాలి

రామకుప్పం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధి మణీంద్రంలో భువనేశ్వరీ పర్యటన ఏర్పాట్లపై ఆయన స్థానిక నేతలతో సమావేశమయ్యారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆమె శనివారం ఉదయం మణీంద్రం పంచాయతీ మొద్దులవంక, మధ్యాహ్నం కెంచనబల్ల పంచాయతీ గాంధీనగరం గ్రామాల్లో మహిళలతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జీ మహ్మద్‌రఫీ, వెంకటరమణ, మంజునాథరెడ్డి, భానుమూర్తి, శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వంతో భరోసా



పార్టీ సభ్యత్వ నమోదులో టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబానికి పార్టీ భరోసాగా నిలుస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మైనారిటీసెల్ జిల్లా కార్యదర్శి సలాంసాబ్‌లు తెలిపారు. బుధవారం రామకుప్పంలో వారు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారు దురదృష్టవశాత్తు మృతి చెందితే తక్షణ సాయంగా పార్టీ రూ.10 వేలు అందిస్తుందన్నారు. బీమా రూ.5లక్షలు బాధిత కుటుంబానికి అందజేస్తుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి సభ్యత్వం తీసుకోవాలన్నారు. టీడీపీకి బాసట నిలిచి, అభివృద్ధి, సంక్షేమం సాగేలా చూడాలన్నారు. పద్మనాభరెడ్డి, ఆనందరెడ్డి, శ్రీరాములురెడ్డి, బాలరాజు, సుబ్రీ, వీరనాగపురంనాగరాజు,నిసార్,చాన్‌బాషా పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో మైనార్టీల ముందంజ



సుహేల్‌బాషా

పుంగనూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయడంలో పుంగనూరు మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా 20స్థానంలో ఉన్నట్లు రాష్ట్ర టీడీపీ కార్యాలయం నుంచి సందేశం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీలో సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతోనే ప్రజలు టీడీపీలో సభ్యత్వం పొందడానికి ముందుకు వస్తున్నట్లు వివరించారు.

డిగ్రీ కళాశాల ఫలితాలు అభినందనీయం

ఎమ్మెల్యే భానుప్రకాష్



మొదటిసంవత్సరం డిగ్రీ ఫలితాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నగరి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి (అటానమస్) సాధించాక విడుదలైన తొలి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే భానుప్రకాష్ అభినందించారు. డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే మొదటి సంవత్సరం డిగ్రీ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి డిగ్రీ కళాశాల ప్రైవేటు కళాశాలలకు దీటుగా అన్ని రంగాలలో ముందుకు దూసుకెళుతుండటం ప్రశంసనీయమని చెప్పారు. క్రీడలు, విద్య, జాబ్‌మేళాలో సత్తా చాటుకోవడం విశేషమన్నారు. పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ వేణుగోపాల్ సమక్షంలో విడుదల చేసిన మొదటి సంవత్సరం ఫలితాల్లో 74శాతం సాధించడం చెప్పుకోదగ్గ అంశమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, ఉప పరీక్షల నియంత్రణ అధికారి రమేష్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారికి ఇష్టారాజ్యంగా స్థలసేకరణ తగదు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న నెత్తకండ్రిగవాసులు

నగరి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఇష్టానుసారం స్థలసేకరణ తగదని నగరి పట్టణ పరిధిలోని నెత్తంకండ్రిగ వాసులు ఆర్డీవో భవానిశంకరికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థల సేకరణలో వస్తున్న మార్పులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని కోరారు. గతంలో జాతీయ రహదారి కోసం ప్రభుత్వం అడిగిన వెంటనే ఇంటిస్థలాలను సైతం వదిలామన్నారు. జాతీయ రహదారికి వదిలిన స్థలం పోను మిగిలిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకుంటే, సర్వీసురోడ్డు పేరిట నేడు ఆస్థలం కూడా వదిలేయమంటే ఎలా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. నివాసమున్న ఇళ్లు సైతం వదిలేస్తే తాము ఎక్కడ నివసించాలంటూ వాపోయారు. ఈప్రాంతంలో పాఠశాల, చర్చి ఉన్నాయని, అధికారులు పునఃపరిశీలించి నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేవరాజులు, కృష్ణమూర్తి, రామలింగం, లక్ష్మీపతి, సలీమ్, చంద్రశేఖర్, గంగాధరం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

నగరి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం పెన్షనర్స్‌డేను ఘనంగా జరుపుకున్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జయచంద్రుడు, కార్యదర్శి ఓ.బాలసుబ్రమణ్యం పెన్షనర్స్‌డే ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పదవీ విరమణ చేసి 15 సంవత్సరాలు నిండిన పెన్షనర్లు సుబ్రమణ్యం, దేవసేనమ్మ, నటరాజన్, లక్ష్మమ్మ, నారాయణమ్మ, ఏలుమలై, కళావతి, సుబ్రమణ్యంరాజు, రామలింగంలను సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా జయచంద్రుడు, కార్యదర్శిగా ఓ.బాలసుబ్రమణ్యం, అసోసియేట్ అధ్యక్షులుగా జయరామ్, రామ్మూర్తిరెడ్డి, కోశాధికారిగా కె.జయరామ్, ఉపాధ్యక్షులుగా కైలాసం, శ్రీహరి, నీలకంఠంరెడ్డి, మురళీధర్, కార్యదర్శులుగా నారాయణరాజు, లక్ష్మీకాంతమ్మ ఎన్నికయ్యారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం: డీఎల్డీవో



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శేషయ్య

బంగారుపాళ్యం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఎల్డీవో శేషయ్య అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యాచరణ ప్రణాళిక 2024-25, స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధిపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి గురించి ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, ఈవోపీఆర్డీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బి.జి.రెడ్డి

బంగారుపాళ్యం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ బి.జి.రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల, విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థులు, ప్రజలకు ఒత్తిడిపై అవగాహన కార్యక్రమాన్ని చిత్తూరులోని బ్లిస్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో భయం వీడి, ఎలా జయించాలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, గజేంద్ర, జయచంద్ర, షణ్ముగం, రోజా ప్రియదర్శిని, ఎయిడ్స్ కౌన్సిలర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జెండర్ క్యాంపెయిన్‌లో రేణుకకు ప్రథమస్థానం



విద్యార్థి రేణుకను అభినందిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జెండర్ క్యాంపెయిన్ పోటీల్లో చిత్తూరు ఎస్పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో థర్డ్ ఎంఎస్సీ చదువుతున్న ఎం.రేణుక ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. తమ కళాశాలకు పేరుతెచ్చిన విద్యార్థిని రేణుకకు రూ.2వేలు రివార్డు, ప్రశంసాపత్రం అందజేసి బుధవారం సన్మానించారు. అభినందించిన వారిలో అధ్యాపకులు శోభాలత, ఉషారాణి, వైజ్ఞాపిక, వినీల, అక్తర్, తిరుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

గోశాల తనిఖీ



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలయ గోశాలను బుధవారం ఈవో పెంచలకిషోర్ పరిశీలించారు. గోశాల స్థితిగతులు, అక్కడ ఉన్న పశువుల పరిస్థితి గురించి, గడ్డి, దాణా గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోవులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పశువులకు ఏదైనా అవసరం ఉంటే వెంటనే తనకు తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈఈ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

50 వేలు దాటిన టీడీపీ సభ్యత్వాలు

● ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గంలో లక్ష టీడీపీ సభ్యత్వాలు చేయించడమే లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 26వ తేదీన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైందని, బుధవారం నాటికి 50,040కు చేరాయని తెలిపారు. చిత్తూరు అర్బన్‌లో 32,280, గుడిపాల మండలంలో 9,050, చిత్తూరు రూరల్‌లో 8,710 సభ్యత్వాలు నమోదయ్యాయని చెప్పారు. పార్టీ కార్యకర్తల కష్ట సుఖాల్లో వారి కుటుంబాలకు అండగా నిలవడంకోసమే సభ్యత్వ నమోదు కార్యక్రమమని స్పష్టం చేశారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికే శిక్షణ

వెదురుకుప్పం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికే శిక్షణ తరగతులు జరుగుతున్నాయని వెదురుకుప్పం ఈవోపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. బుధవారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ జరిగింది. కార్యక్రమంలో ఏవో నాగమణి పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం

విజయపురం, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని ఎంపీడీవో రమణప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా లభించే వనరులతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని, ఇందుకోసం ప్రణాళిక ఉండాలని సూచించారు. అనంతరం ఈవోపీఆర్డీ రాజేంద్ర సూచనలిచ్చారు. అభివృద్ధి ప్రణాళికపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 98 అర్జీలు వస్తే, వాటిలో 80 పరిష్కరించామని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించనున్నట్లు చెప్పారు. బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో నాలుగు అర్జీలు రాగా, అన్నిటిని పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.

అంతర్జాతీయ అబాకస్‌లో యూసీమాస్ విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అబాకస్ అంతర్జాతీయ పోటీల్లో చిత్తూరు యూసీమాస్ అబాకస్ సంస్థ విద్యార్థులు పతకాలు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ భార్గవి, ఉమ తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో యూసీమాస్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. పతకాలు సాధించిన వారిలో యుక్తశ్రీ, దీక్షిత్, రక్షన్, తన్వీర్‌లు ఛాంపియన్లుగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు. ఏడుగురు రజిత, మరో ఏడుగురు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని తెలిపారు.

జాతీయస్థాయి అబాకస్‌లో రన్నరప్‌గా శ్రీకర్



యాదమరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న శ్రీకర్ ఇటీవల ఢిల్లీలో జరిగిన యూసీమాస్ అబాకస్ ఇంటర్నేషనల్ కాంపిటేషన్‌లో జాతీయస్థాయి, అంతర్జాతీయస్థాయిలో రన్నరప్ విజయం సాధించాడు. మండలంలోని దళవాయిపల్లి గ్రామానికి చెందిన మధుయాదవ్ కుమారుడు శ్రీకర్ రన్నరప్‌గా నిలవడంతో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి. కృష్ణబాబు విద్యార్థి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

పీఎంఏజీఏవైఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పీఎం అనుచిత జాతి అభ్యుదయ యోజన పథకం (పీఎంఏజీఏవైఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మితో కలిసి పీఎంఏజీఏవైఎస్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రుణాలు పొందిన వారికి డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్ సంయుక్తంగా రూ.50 వేలు సబ్సిడీ ఇస్తోందన్నారు. లబ్ధిదారులు బ్యూటీ పార్లర్, కంప్యూటర్ సెంటర్, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ పనిముట్లు తదితర వాటిని పొందడానికి రుణాలు ప్రోత్సాహంతో పాటు సబ్సిడీ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ మహిళలు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం

పూతలపట్టు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే సుచి సంస్థ ధ్యేయమని ఆ సంస్థ డైరెక్టర్లు పాల్ విజయ్‌కుమార్, గ్లోరి విజయకుమారి అన్నారు. మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద వున్న సుచి సంస్థ కార్యాలయంలో బుధవారం వందమంది వృద్ధులకు, వితంతువులకు ఉచితంగా చాప, చీర, దుప్పటి, టవళ్లు, బ్రెడ్ అందజేశారు.

వర్షం పడిందంటే తిప్పలే...!

● నీళ్లలో నానుతున్న ఇంటిగోడలు



శీనుఆచారి ఇంటివద్ద నిల్వ ఉన్న వర్షపు నీరు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వర్షం పడిందంటే తూగుండ్రం గ్రామంలోని ఆ మూడిళ్లకు తిప్పలు తప్పడం లేదు. గంగాధరనెల్లూరు మండలంలోని తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ ప్రాంతంలో కురిసిన వర్షం నీరు గతంలో కాల్వద్వారా తూగుండ్రం చెరువుకు చేరుకునేది. కాలక్రమేణా ఆ కాల్వ పూడిపోవడంతో తూగుండ్రం మీదుగా పల్లపు ప్రాంతంలోకి వెళ్లిపోయేది. రోడ్డు ఎత్తుపెంచేసిన కారణంగా నీరు వెళ్లేందుకు మార్గంలేక తూగుండ్రంలోని శీనుఆచారి, శశికళ, కుమార్‌మొదలి ఇళ్లవద్దే నిలిచిపోతోంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో వారి ఇళ్ల గోడలు ఊటెక్కిపోతున్నాయి. దీనితోడు ఆ ఇళ్ల సమీపంలోనే వ్యర్థాలు వేయడంవల్ల అవన్నీ వర్షపునీటిలోనే కుళ్లిపోతున్నాయి. దీంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయి అనారోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షపునీరు ఇక్కడ నిల్వఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆ మూడు కుటుంబాలు వారు కోరుతున్నారు.

వైసీపీ మత్తు నుంచి అధికారులు బయటకు రావాలి

● విప్ థామస్



సాగునీటి సంఘం అధ్యక్షులను సన్మానించిన విప్ డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొంత మంది అధికారులు ఇంకా వైసీపీ ప్రభుత్వ మత్తులోనే ఉన్నారని, ఆ మత్తులో నుంచి బయటకు రావాలని ప్రభుత్వ విప్ థామస్ హెచ్చరించారు. బుధవారం తాటిమాకుపల్లెలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర నాయుడు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని గ్రామస్తుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు, భూకబ్జాలు, ఆన్‌లైన్ నుంచి తొలగించడం తదితర అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సాగునీటి సంఘం అధ్యక్షులను టీడీపీ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథం పిళ్లై, డీటీ రవీంద్రబాబు, టీడీపీ నాయకులు గుండయ్య, రఘునాథరెడ్డి, షణ్ముగం, కుమార్, జయరామ్ నాయుడు, నాగరాజు, నిరంజన్‌రెడ్డి, వేమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయ పరికరాలు అందించేందుకు నిర్వహించిన గుర్తింపు శిబిరాన్ని థామస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చేతి, వంక, కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రం, బ్యాటరీ ట్రైసైకిల్, వాయిస్ ఫోన్, తదితర ఉపకరణాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, తహశీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీవో మోహన మురళి, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నాయకులు గుండయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు పెరిగిన దోమలు

- జ్వరాల బారిన ప్రజలు

పాలసముద్రం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాల కారణంగా దోమల బెడద ఎక్కువైంది. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి చెరువులు కలుజు పారుతున్నాయి. భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి వ్యవసాయ బావులు నిండు కుండలా మారాయి. గ్రామాల్లో నీరు ఎక్కడబడితే అక్కడ నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. పంచాయతీ సర్పంచులు, అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టక పోవడంతో జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నాయకుల ఇంటిముందు ర్యాంపు తొలగించడం అమానుషం

- వైసీపీ నేతలు కరుణ, రోజా



ర్యాంపు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రోజా, కరుణాకర రెడ్డి

నగరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల ఇంటి ముందు ర్యాంపును అధికారులతో తొలగించడం అమానుషమని మాజీమంత్రి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌కే రోజా, జిల్లా వైసీపీ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి అన్నారు. నగరి మండల పరిధిలోని దామరపాకంలో గణపతిశెట్టి ఇంటి ముందు ర్యాంపును మంగళవారం అధికారులు తొలగించారు. ఈ సంఘటనను పరిశీలించి వైసీపీ నాయకులకు భరోసా కల్పించడానికి బుధవారం దామరపాకం గ్రామానికి వారు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు నోటీసును అంటించి అదే రోజు ర్యాంపును తొలగించడం దారుణమని అన్నారు. వైసీపీ హయాంలో గ్రామాల్లో రైతుభరోసా, సచివాలయం లాంటి కార్యాలయాలు కట్టిస్తే టీడీపీ నాయకులు ఇళ్ల ముందు ర్యాంపులను పగులగొట్టి కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని చెప్పారు. ముందస్తుగా నోటీసులిచ్చినా పట్టించుకోకపోవడంతో మంగళవారం వీధిలో వాహనాలు పోవడానికి ఇబ్బందులు లేకుండా ర్యాంపును తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఐటీఐ విద్యార్థులకు స్మార్ట్ స్కిల్స్‌పై అవగాహన



మాధవరం ఐటీఐలో స్మార్ట్ స్కిల్‌పై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

విజయపురం, డిసెంబర్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు బుధవారం సింక్రో పాలిట్రిజియన్స్ శిక్షకులు రవిశంకర్ స్మార్ట్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు వృత్తి విద్యతో పాటు కొన్ని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కంప్యూటర్ వంటి రంగాల్లో స్వల్ప కాలిక కోర్సులతో మెరుగైన ఉపాధి పొందవచ్చన్నారు. కళాశాల అధ్యాపకులు అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శితో భేటీ



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 15న తిరుపతి రెడ్డిభవన్‌లో జరిగాయి. ఇందులో రాష్ట్ర అధ్యక్షులుగా జి.రవికుమార్ (కడప), ప్రధాన కార్యదర్శిగా కె.రాజ్‌కుమార్ (ప్రకాశం), ఉపాధ్యక్షులుగా డి.నరేష్‌బాబు (చిత్తూరు), సహాధ్యక్షుడుగా కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడుగా కరీముల్లా (తిరుపతి)లతో పాటు కార్యవర్గసభ్యులుగా 17మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరూ బుధవారం రాష్ట్ర ఆర్థిక ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కుంబా ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి వీర్రాజు బాబు, డైరెక్టర్ ఎన్.మోహన్‌రావు, ఇతర అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం బహూకరించారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు

● తెలుగుయువత నేత హేమాద్రి నాయుడు

గుడిపాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా చిత్తూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక ఇటు యువత, అటు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని చిత్తూరుని స్మార్ట్ సిటీగా, గుడిపాల మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే శాయశక్తులా కృషిచేస్తుంటే కొంతమంది దానిని అడ్డుకోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పళని గౌండర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పెంపుడు కుక్కలకు వైద్యశిబిరం

బంగారుపాళ్యం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారుపాళ్యం ప్రాంతీయ పశువైద్యశాలలో ఈనెల 20వ తేదీన పెంపుడు కుక్కల ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ షేక్ ఆసిఫ్ తెలిపారు. ఈ వైద్యశిబిరంలో టీకాలు, నట్టల నివారణ మందులను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల్లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

30 ఏళ్లుగా అనుభవంలో ఉన్నా ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు

విజయపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీకేటీ భూములు 30 సంవత్సరాల అనుభవంలో ఉన్నా ఆన్‌లైన్‌లో మా పేరు కనిపించడం లేదని మండలంలోని శ్రీహరిపురంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కిరణ్‌కు రైతులు మొర పెట్టుకున్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా రెండు తరాలు అనుభవిస్తున్న తమ భూములను గుర్తించి ఆన్‌లైన్ చేయాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించి గ్రామానికి మొదటిసారి వచ్చినందున ఆయన్ను పూలమాల దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ అశోక్, వీఆర్వో వెంకటేశులు, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, దశరథరాజు, సురేష్, జయరామరాజు, నరేష్, చెంచురాజు, చిన్నబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో అన్నీ తప్పులే

● రెవెన్యూ సదస్సులో రైతుల గోడు

గుడిపాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో ఒకరి భూమిని మరొకరికి నమోదుచేసి గ్రామాల్లో చిచ్చుపెట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని ఏఎల్‌పురంలో తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలను పరిశీలించి న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీయిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గురప్ప నాయుడు, టీడీపీ నాయకులు హేమాద్రి నాయుడు, బాబు నాయుడు, పళని గౌండర్, మోహన్, భూపాల్ నాయుడు, ఆర్ఐ రామసాయి, వీఆర్వోలు శ్రీనాథ్ రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు

పాలసముద్రం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ అరుణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని తిరుమలరాజుపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్, వీఆర్వో శ్రీను, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


వెదురుకుప్పం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ అన్నారు. బుధవారం వెదురుకుప్పం మండలం దేవళంపేటలో రెవెన్యూ గ్రామసభ జరిగింది. రెవెన్యూ సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. తహసీల్దార్ రమేష్ సహా ఉద్యోగులు హాజరయ్యారు. టీడీపీ నేతలు భాష్యం సతీష్‌నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

22న వనభోజన మహోత్సవం

బంగారుపాళ్యం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో ఈనెల 22వ తేది ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బుస్సా నాగరాజ్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఈడిగ, గౌడ కులస్థులు కుటుంబ సమేతంగా కలుసుకోవాలని పిలుపునిచ్చారు. కొండపైన ఆటలు, నృత్యపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేంద్ర గౌడ్, బుస్సా జనార్దన గౌడ్, మురళీగౌడ్, ఎల్లప్ప గౌడ్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ఆయాలు, వాచ్‌మెన్ నిరసన

నగరి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల, వాచ్‌మెన్‌ల పెండింగ్ జీతాలు చెల్లించాలని ఎంఈవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తంచేశారు. గత ఐదు నెలలుగా జీతాలు రాక నానా తంటాలు పడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య పేర్కొన్నారు. వారికి తక్షణమే జీతాలు అందించకుంటే తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంఈవో శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఆయాలకు బాత్‌రూమ్‌లను శుభ్రం చేయడానికి సోపులు, ఫినాయిల్, గ్లౌజ్‌లు, కాళ్లకు చెప్పులు, గుర్తింపుకార్డులు, యూనిఫామ్ అందించాలని కోరారు. 108 జీవో ప్రకారం రూ.11,500 జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆయాల సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ, కార్యదర్శులు నాగభూషణం, కళాసరస్వతి, తులసి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి సాయం

వి.కోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర వసతి గృహంలో వంట విధులు నిర్వర్తించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నాగలక్ష్మి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది.ఆమె కుటుంబ సభ్యులకు స్థానిక టీడీపీ నేతలు రామచంద్ర నాయుడు, సుధాకర రెడ్డి, హరినాథరెడ్డి, సుబ్రమణ్యం శెట్టి, గుణశేఖర్‌రెడ్డి, రాంబాబు సంతాపం తెలిపారు. జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రూ.18వేల ఆర్థిక సాయం అందించారు. జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ఏఎస్‌డబ్ల్యూ మీనాక్షిదేవి, సంఘ జిల్లా ప్రధానకార్యదర్శి జ్ఞానశేఖర్, వరప్రకాష్, మొగిలప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రొంపిచెర్లలో చల్లాబాబు పుట్టినరోజు వేడుకలకు ఏర్పాట్లు

చల్లాబాబు జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు



రొంపిచెర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుపతి-పీలేరు జాతీయ రహదారిలో రొంపిచెర్ల మండల సరిహద్దు నుంచి చల్లాబాబు ఇంటివరకు బ్యానర్లతో, కటౌట్లతో నిండిపోయాయి. సుమారు 10 వేల మందికి భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. టపాసులు, గజమాలలు,కేక్‌లు పార్టీ శ్రేణులు సిద్ధం చేస్తున్నాయి. కేరళ వాయిద్యాలు, డ్రమ్స్‌తో ఆయనకు స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు.

పుంగనూరు: చల్లా రామచంద్రారెడ్డి జన్మదినాన్ని గురువారం ఘనంగా



నిర్వహించాలని స్థానిక టీడీపీ నాయకులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. పుంగనూరు నుంచి 1200మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో రొంపిచెర్లకు వెళ్లనున్నారు. పుంగనూరు నుంచి భారీ కాన్వాయ్‌తో వెళ్లి రామచంద్రారెడ్డితో కేక్ కట్ చేయించనున్నారు. పెద్ద ఎత్తున పూలమాలలు, పుష్ప గుచ్ఛాలు, శాలువలతో తరలివెళ్తున్నారు. స్థానిక నాయకులు సీవీరెడ్డి, శ్రీకాంత్, మాధవరెడ్డి, సుహేల్‌బాషా, దినేష్ శమీపతి, రెడ్డెప్పనాయుడు, చలపతి నాయుడు, శంకర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

నారా భువనేశ్వరికి ఘనస్వాగతం

వి.కోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చేరుకున్న నారా భువనేశ్వరికి ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు స్వాగతం పలికారు. బుధవారం మధ్యాహ్నం బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాగానే కుప్పం టీడీపీ నేతలతో కలసి ఆమెను సాదరంగా ఆహ్వానించారు. టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు త్యాగరాజ్, కోదండరెడ్డి, జనార్దన్‌రెడ్డి, షణ్ముగం తదితరులు ఉన్నారు.


జన్మదిన
శుభాకాంక్షలు
మంచికి మారుపేరు,
నిరంతరం ప్రజా సంక్షేమం కోసం
పరితపించే ప్రజానాయకుడు,
పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్
శ్రీ చల్లా రామచంద్రా రెడ్డి గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
రాష్ట్ర రవాణా, యువజన,
క్రీడా శాఖామంత్రి
శ్రీ చల్లా రామచంద్రా రెడ్డి
పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్
సి.సుబ్రమణ్యం నాయుడు
టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు
సోమల మం.
పి. శ్రీనివాసులు
గ్రామ కమిటీ అధ్యక్షులు
కందూరు
కె.హరిప్రసాద్ నాయుడు
టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం
ఆర్గనైజింగ్ సెక్రటరీ, సోమల
కె. శ్రీనివాసులు నాయుడు
మాజీ సర్పంచ్
పి.యం. మల్లికార్జున
టీడీపీ మండల ఉపాధ్యక్షుడు
సోమల
వై. మోహన్ నాయుడు
టీడీపీ నాయకుడు
పి. శివశంకర
గ్రామ కమిటీ అధ్యక్షులు
సోమల
వి.మహేంద్ర కుమార్
క్లస్టర్ ఇన్‌చార్జ్
సోమల
వి.భానుప్రకాష్ నాయుడు
మాజీ గ్రామకమిటీ అధ్యక్షులు
ఇరికిపెంట
బాలక్రిష్ణమ నాయుడు
క్లస్టర్ ఇన్‌చార్జ్
సోమల
టి. రమేష్ నాయుడు
మాజీ ఎం.పి.టి.సి.
కె. కోటేశ్వర్ రావు
మాజీ నీటి సంఘం అధ్యక్షులు
ఇరికిపెంట
ఎం.సతీష్ నాయుడు
గ్రామ కమిటీ అధ్యక్షులు
నెల్లిమంద, సోమల మండలం
ఎం.రెడ్డెప్ప నాయుడు
ఇరికిపెంట
పి.చంద్రశేఖర్ నాయుడు
ఇరికిపెంట
జి.సుబ్రమణ్యం
టీడీపీ బి.సి. సెల్
అధ్యక్షులు, సోమల


జన్మదిన
శుభాకాంక్షలు
ప్రజాసమస్యల
పరిష్కారంకోసం
నిరంతరం ఉద్యమిస్తూ,
కార్యకర్తలకు ఆపదలో
కష్టాల్లో అండుబాటులో వుంటూ
అందరి అభిమానాన్ని చూరగొన్న
మా ప్రియతమ నాయకులు
శ్రీ చల్లా రామచంద్రా రెడ్డి గారికి
మా హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ చల్లా రామచంద్రా రెడ్డి
పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్
పలుకూరి ధనంజయ నాయుడు
మహేష్
శంకర
యోగేంద్ర
రాణెమ్మ ప్రభాకర్
రాజగోపాల్ నాయుడు
నవీన్
సుబ్రమణ్యం నాయుడు
పూల రమేష్
త్యాగ
శ్రీకాంత్
తెలుగుదేశం పార్టీ నాయకులు - కార్యకర్తలు
పులిచర్ల మండలం, పుంగనూరు నియోజకవర్గం

అర్జీలను త్వరగా పరిష్కరించండి

చిత్తూరు రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 98 అర్జీలు వస్తే, వాటిలో 80 పరిష్కరించామన్నారు.


జన్మదిన
శుభాకాంక్షలు
సమస్యల ఛేదనలో
కిరీటీకి సాటి అతడు.
విలువలెరిగిన నాయకుడు,
పరిణతి చెందిన రాజనీతిజ్ఞుడు,
మాకు అత్యంత ఆప్తులు,
పుంగనూరు నియోజకవర్గ
టీడీపీ ఇన్‌చార్జ్
శ్రీ చల్లా రామచంద్రా రెడ్డి గారికి
హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ చల్లా రామచంద్రా రెడ్డి
పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్
సి.హెచ్. కుమార్ రెడ్డి
లెక్కల ధనంజయులు నాయుడు
ముల్లంగి వెంకట్రమణ
సి.హెచ్. సుబ్బారెడ్డి
సదాశివరెడ్డి
రమేష్ నాయుడు
నజీర్ సాహెబ్
బండ్ల రమేష్
మురళి
చెంగల్రాయ నాయుడు
హ్యాపీ వైన్స్
కల్లూరు, పులిచెర్ల మండలం,
పుంగనూరు నియోజకవర్గం

రెవెన్యూ సదస్సులో రైతుల గోడు

గుడిపాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో ఒకరి భూమిని మరొకరికి నమోదుచేసి గ్రామాల్లో చిచ్చుపెట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని ఏఎల్‌పురంలో తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలను పరిశీలించి న్యాయం చేస్తామని తహశీల్దార్ హామీయిచ్చారు. సర్పంచ్ గుర్రప్పనాయుడు, నాయకులు హేమాద్రినాయుడు,బాబునాయుడు పాల్గొన్నారు.


జన్మదిన
శుభాకాంక్షలు
మంచికి మారుపేరు,
నిరంతరం ప్రజా సంక్షేమం కోసం
పరితపించే ప్రజానాయకుడు,
పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్
శ్రీ చల్లా రామచంద్రా రెడ్డి గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ చల్లా రామచంద్రారెడ్డి
తెలుగుదేశం పార్టీ పుంగనూరు
నియోజకవర్గ ఇన్‌చార్జ్
శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖామాత్యులు
ఓబులేశ్వర్ రెడ్డి
టీడీపీ రాజంపేట పార్లమెంటరీ
రైతు అధ్యక్షులు, రొంపిచెర్ల
రవికుమార్ నాయుడు
మాజీ సర్పంచ్
బోడిపాటివారిపల్లె, రొంపిచెర్ల
ఉయ్యాల రమణ
టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు
రొంపిచెర్ల
శ్రీనివాసులు నాయుడు
టీడీపీ నాయకులు
రొంపిచెర్ల
శేషాద్రి నాయుడు
టీడీపీ నాయకులు,
రొంపిచెర్ల
అమరనాథ రెడ్డి
మాజీ ఎంపిటీసీ
రొంపిచెర్ల
పొన్నం వెంకటరమణ
వాటర్ షెడ్ చైర్మన్
వరంపాటి అమరనాథ రెడ్డి
టీడీపీ నాయకులు
మారసాని రవి నాయుడు
టీడీపీ నాయకులు
గోవర్ధన్ రెడ్డి
టీడీపీ నాయకులు
వి.మదనమోహన్ రెడ్డి
టీడీపీ నాయకులు
రొంపిచెర్ల
నరీన్
టీడీపీ నాయకులు
రొంపిచెర్ల

వైసీపీ కష్టాల నుంచి రైతులకు విముక్తి

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో సృష్టించిన కష్టాల నుంచి ప్రతి రైతుకు విముక్తి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గుంజార్లపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అడ్డగోలుగా చేపట్టిన భూముల రీసర్వే రైతుల మధ్య విద్వేషాలను సృష్టించిందన్నారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం రైతుల



గుంజార్లపల్లె సదస్సులో మాట్లాడుతున్న గౌనివారి

శ్రేయస్సు కోసం సదస్సులు ఏర్పాటు చేపిందన్నారు. సదస్సుల్లో ఇచ్చే ప్రతి వినతి పత్రం పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. సదస్సులో తహసీల్దారు శివయ్య, స్థానిక సర్పంచు విజయరామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జీ ఆంజినేయరెడ్డి పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

పుంగనూరు, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం విజయవంతం చేయాలని పుంగనూరు హైందవులు కోరారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో హైందవ శంఖారావం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేవాలయాల రక్షణ కోసం తలపెట్టిన మహత్తర కార్యక్రమానికి లక్షలాధిమంది తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలో సభ జరుగుతుందన్నారు.

22న వనభోజన మహోత్సవం

బంగారుపాళ్యం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ దేవస్థానంలో ఈనెల 22వ తేది(ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బుస్సా నాగరాజ్ గౌడ్ తెలిపారు.